# సంకల్పంలో సందేహం

- యేలురిపాటి ఆంజనేయశర్మ

అమెరికాలో నివసిస్తున్న ప్రతి హిందువు ఏదో ఒక సమయంలో పూజగాని వ్రతం గాని చేస్తూనే వుంటాడు. కొందరు ప్రతిరోజు ఆరాధనమో, సంధ్యా వందనమో చేసేవారున్నారు. కనీసం పండుగలు జరుపుకొనేవారున్నారు. అందరికీ వచ్చే కొన్ని సామాన్య సందేహాలకు సమాధానం అన్వేషించే ప్రయత్నం ఈ వ్యాసం.

మొదటిది. పండుగలు కొన్నిసార్లు మనకు ముందుగా ఎందుకు వస్తున్నాయి?

ఇండియా కంటే సమయంలో వెనుక ఉన్న మనకి పండుగ ముందే రావటం న్యాయమా?

ఇక్కడ తిథివార నక్షత్రాలు ఎలా చూసుకోవాలి? ఎలా చెప్పుకోవాలి?

ఇండియాలో అయితే 'జంబూద్వీపే, భరతఖండే, భరతవర్షే' అంటూ చెబుతాం కదా! ఇక్కడ ఏం చెప్పాలి? ఇలాంటివి సందేహాలు.

అసలు మనం ఏం పని చేసినా అది సక్రమంగా పూర్తి కావాలంటే ప్రదేశం (place), సమయం (time), చేసే వ్యక్తి (person) ముఖ్యమైనవి. ఇంకొంచెం సరదాగా చెప్పాలంటే, రైల్వే స్టేషనుకెళ్ళి పోస్టల్ స్టాంపు పొందలేము. బస్ స్టాండుకెళ్ళి కిరాణా వస్తువులు అందలేము. అంటే, ఏపని ఎక్కడ చెయ్యాలో అక్కడ చేస్తేనే ఫలిస్తుంది. దైవపూజకు కూడా ప్రదేశప్రాధాన్యత ఉంది. మనం ఆకర్షించే లేదా ఆహ్వానించే దైవీశక్తులు (దేవీదేవతలు) వాటికి అనువైన, అనుగుణమైన, ఆకర్షణీయమైన ప్రదేశాలలోనే కేంద్రీకరించబడుతాయి. వాటికి అనుగుణంగా తీర్చిదిద్దటం, శుద్ధి చేయటం, అలంకరించటం విధివిధానాల్లో భాగమైతే, అనంతవ్యాప్తమైన దైవశక్తిని మనకవసరమైన చోటికి కేంద్రీకరించటానికి స్థలసంకీర్తనం అవసరం. మనం ఎక్కడ ఉన్నామో గుర్తించుకోవటం, తెలుపుడి చేయటం స్థలసంకీర్తనం.

భూమి మీద వున్న ఏడు ద్వీపాల్లోను నేరేడు (జంబూ) చెట్లకు ఆదియో, అస్తిత్వానికి ఆధారమోగాని అది జంబూ ద్వీపం. సింధు (నది) నుండి సింధువు (సముద్రం) వరకు ఉన్న భూభాగం ప్రముఖంగా భరతుడేలిన భరతవర్షం. అందులో భరతుడు పాలించిన ప్రదేశం భరతఖండం. దానిలో ఏవో రెండు ప్రముఖనదులను గుర్తించి వాటిమధ్య (గంగా-గోదావరి మధ్యప్రదేశే, కృష్ణాగోదావరి మధ్యప్రదేశే, కృష్ణాకావేరీ మధ్యప్రదేశే...ఇలాంటివి), మండలం (ఉదా: భీమ మండలం), ఫలానా ముఖ్యపుణ్యక్షేత్రానికి ఈ ప్రదేశంలో (శ్రీశైలస్య ఈశాన్యప్రదేశే) స్వగృహంలో లేదా ఫలానా దేవాలయంలో, ఫలానా నదీతీరంలో. . . . అలా చెప్పుకుంటాం. ఇదంతా ప్రదేశాన్నిగురించి.

ఇక ఇక్కడెలా? ఏడుద్వీపాల్లోను ఇది జంబూ ద్వీపం కాదని మనకు తెలుసు. మరేద్వీపం?

ప్లక్ష-కుశ-క్రౌంచ-శాక-శాల్మల-పుష్కర ద్వీపాల్లో ఏది ఇది?

మన పురాణాలను మరింత సక్రమంగా మధిస్తే దొరకవచ్చేమో!

సరి అయిన ఆధారాలు ఏవీ పేరుకి లేకపోయినా, దీనిని కొందరు 'క్రౌంచ' ద్వీపమంటున్నారు.

దీనికిఆధారం, క్రౌంచమంటే గ్రద్ద. అది వీరి జాతీయపక్షి. ఉత్తర అమెరికా ఖండం, ముఖ్యంగా ఈదేశం రెక్కలు విచ్చుకున్న గ్రద్దను పోలిఉండడం గమనించవచ్చు. మొత్తం మీద ఇది క్రౌంచ ద్వీపం. మిగిలిన పేర్లలో ఈమాత్రం సామ్యం లేదు కనుక ఇది ప్రస్తుతానికి నడుస్తోంది. దీనికంటే జంబూద్వీపం కాని మరో ప్రదేశంలో (జంబూద్వీపాత్ అన్యతమ ప్రదేశే) అనటం న్యాయమేమో అని నా వ్యక్తిగత అభిప్రాయం.

ఉత్తర అమెరికా ఖండే, అమెరికా దేశే, రేరిటన్ నదీతీరే, ఎడిసన్ పట్టణే, స్వగృహే. . . . ఇలా చెప్పుకోవచ్చు. (రమణక ఖండం లాటి మాటలు వింటున్నా, వాటికి కనీసం క్రౌంచ సామ్యము లేదు).

ఇక కాలం విషయానికి వస్తే, అద్యబ్రహ్మణఃద్వితీయపరార్థే, శ్వేత వరాహకల్పే, వైవస్వతమన్వంతరే, కలియుగే, ప్రథమపాదే వంటి పెద్దపెద్ద కాలగణనలనుండి సంవత్సరం, అయనం, ఋతుమాసం, పక్షం వరకు బాగానే చెప్పేసుకుంటాం. వారం కూడా మామూలే. ఒక్క తిథి, నక్షత్రాల దగ్గర కొంచెం తేడా. వాటినిబట్టే పండుగల తేడాలు - అన్నీ.

కొంచెం స్థిమితంగా ఆలోచిస్తే ఇది చాలా సింపుల్.

భూమి తనచుట్టూ తాను తిరుగుతూండటం వల్ల రాత్రి-పగలు ఏర్పడుతున్నాయని మనకు తెలుసు. రేఖాంశాల (గ్లోబుపై నిలువు గీతలు)పై సూర్య కిరణ ప్రసారం ద్వారా సమయాల్లో మార్పులు మనకు తెలుసు. 360°, 24 గంటలు ఇవన్నీ ఒక పక్కన ఊహించుకుంటూనే--

చంద్రుడు భూమి చుట్టూ తిరగటంవల్ల తిధులు, ఏర్పడుతున్నాయి. దగ్గర అవటం, దూరంకావటం కోణం మారటాలనుబట్టి వృద్ధి క్షయాలు, కృష్ణ శుక్లపక్షాలు, అమావాస్య పున్నములు ఏర్పడుతున్నాయి. భూమి మొత్తం పై చంద్రుని ప్రభావం ఒకేసారి పడుతోంది. అందువల్ల భూమి మొత్తంపై తిథి ప్రవేశం ఒకేసారి జరుగుతోంది. రేఖాంశాలనుబట్టి మన సమయానికి అనుగుణంగా, తిధి ప్రవేశాదులను గణించుకుంటాం.

భూమిమొత్తం మీద చంద్రుని ప్రభావం ఒకేసారి పడ్డా, మనసమయానికి మనం చూస్తున్నాం.

ఇంకొంచెం సింపుల్ గా చెబుతాను. ఇటీవల సూర్యగ్రహణం ఏర్పడింది. దాని ప్రభావం ఇండియాలోనే గాని ఇక్కడ లేదనుకున్నాం. ఎందుకంటే, ఆ సమయానికి మనకిక్కడ సూర్యుడే కనబడలేదు. అలాగే చంద్రగ్రహణమూను.

సమయంలో తేడాలనుబట్టి అక్కడ గ్రహణమొచ్చిన 10.5 గంటలకు ఇక్కడ గ్రహణం రావటంలేదు కదా! అంటే అంతరిక్ష సంఘటన ఒకేసారి జరుగుతోంది. ఎవరి సమయానికి వారు వీక్షిస్తున్నారు, లేదా కనబడటం లేదంటున్నారు. చూసే సమయంలో మార్పులున్నా తిథిప్రవేశాలు ఒకేసారి జరుగుతున్నాయన్నమాట.

ఉదా: శ్రీరామనవమి భారతదేశంలో (19వతేది) ఉదయం 5.5 గం: నవమి మొదలైతే, అదే సమయానికి మనకిక్కడ 18వ తేదీ రాత్రి 7 గం.

అంటే పగలంతా అష్టమే. మర్నాడు ఉదయానికి నవమి వస్తుంది కనుక, మనకూ 19 నే అవుతుంది. ఇక్కడ బాగానే వుంది.

అదే అక్కడ 19 సాయంత్రం 3 గం. నవమి వస్తే, ఇక్కడ 19 ఉదయం 5.5గం. కే నవమి వస్తుంది కదా. మనం 19 న నవమి చేసుకుంటాం. వాళ్ళు 20న గాని చెయ్యటానికి లేదు. ఎందుకంటే మర్నాటి సూర్యోదయానికే వాళ్ళకి నవమి వస్తుంది కనుక. ఉదయం నుండి వాళ్ళకి అష్టమే కదా!

ఆ పండుగలు సూర్యోదయ, సూర్యాస్తమయ ప్రాధాన్యతలనుబట్టి మారుతూంటాయి. మొత్తం మీద ముందు-వెనుక అని ఖంగారు పడక ఇవన్నీ లెక్కించి వ్రాసిన నిపుణుల వ్రాతలనుబట్టి నడుచుకోవటమంత సుఖం లేదు.

ఆంధ్రదేశంలో విడుదల అవుతున్న పంచాంగాలలోకూడ "దేశకాలాంతర సంస్కార పట్టిక" పేరుతో, పంచాగం గణించిన ఊరినుండి ఇతర ఊళ్ళకు ఎన్ని నిమిషాలు కలపాలో లేదా తీసేయాలో ఇస్తూనే ఉన్నారు. అదే ఇక్కడికి గంటల మార్పు. అంతే తేడా.

కనుక పూజల్లో దేశకాల ప్రాధాన్యతలనుగుర్తించి చేస్తే మంచి ఫలితాలొస్తాయి. ముందు చెప్పుకున్నట్లు దేశం (ప్రదేశం) లాగే కాలాన్నిబట్టికూడా ఆయా దైవీ శక్తులు ఉత్సాహంగా, కేంద్రీకృతమై ఫలదాయకాలవుతాయి.

ఊదా: దేవీ నవరాత్రులలో మాతృశక్తిగా విస్తరించే దైవీశక్తి శివరాత్రినాడు శివశక్తిగా విజభిస్తుంది. వరలక్ష్మీ వ్రతం నాడు లక్ష్మీప్రదాయిని అయితే, వినాయకచవితినాడు విఘ్నహంతగా మారుతుంది. ఫలితం ఎవరికి రావాలో ఆ వ్యక్తి తనకు మౌలిక (**roots**) గుర్తింపు అయిన గోత్రం చెప్పుకొని, పేరు చెప్పుకొని పూజచేస్తే ఫలితముంటుంది. ఒకరు తింటే మరొకరికి కడుపునిండదు కదా! ఇదీ అంతే.

మొత్తం మీద దేశ కాల ప్రాధాన్యతలనెరిగి సంస్మరిస్తూ చేసే పూజ వ్యక్తికి ఫలితాలనిస్తుంది. దైవానుగ్రహకారకమవుతుంది.

******